

దగ్ధమైన కారు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నరసరావుపేట రోడ్డులోని పున్నమి అపార్టుమెంట్ వద్ద శనివారం కారుకు మరమ్మతులు చేస్తుండగా మంటలు చెలరేగి దగ్ధమైంది.



గాలులకు నేలకొరిగిన తాటిచెట్లు

పిట్టలవానిపాలెం: ఈదురు గాలులకు స్థానిక మండల పరిషత్ కార్యాయం ఎదురుగా రెండు తాటిచెట్లు కూలి విద్యుత్ స్తంభంపై పడటంతో సరఫరాకు అంతరాయం కలిగింది.

శ్రీవారికి చందన అలంకరణ



నరసరావుపేటఈస్ట్: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేంచేసి ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వారాహి నవరాత్రులను పురస్కరించుకొని శనివారం శ్రీ వారికి చందన అలంకరణ నిర్వహించారు.

న్యూస్‌రీల్

సాంకేతిక పరిజ్ఞానంతో విపత్తుల నిర్వహణ

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



తాడేపల్లిరూరల్: విపత్తులను ఎదుర్కొనేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రెవెన్యూ శాఖ (ల్యాండ్స్ మరియు విపత్తుల నిర్వహణ, రిజిస్ట్రేషన్స్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విపత్తుల సంస్థ అవలంభిస్తున్న అనేక సాంకేతికతల గురించి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఆయనకు వివరించారు. తుపానులు, వరదలు, వడగాల్పులు, భారీ వర్షాలు, పిడుగుపాటు హెచ్చరిక సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి పంపించే కార్యాచరణను సిసోడియాకు వివరించారు. విపత్తులను ఎదుర్కోవడానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు, ప్రణాళికలు అమలు చేస్తూ హెచ్చరికలు జారీచేస్తూ ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించాలని సూచించారు. ప్రాజెక్ట్ మేనేజర్స్ బస్వంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- దుగ్గిరాలలో 148.8 మి.మీ వర్షం
- 83.3 మి.మీ సగటు వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 148.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తుళ్లూరు మండలంలో 29.8 మి.మీ వర్షం పడింది. సగటున 83.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 142.2 మి.మీ., గుంటూరు తూర్పు 136.2, తెనాలి 123.4, కొల్లిపర 115.8, చేబ్రోలు 107, ఫిరంగిపురం 105.6, పెదకాకాని 103.4, వట్టిచెరుకూరు 86.6, ప్రత్తిపాడు 85.4, మేడికొండూరు 80.6, పొన్నూరు 48, పెదనందిపాడు 42.4, తాడేపల్లి 37.6, కాకుమాను 37.2, తాడికొండ 37.2, మంగళగిరి మండలంలో 33 మి.మీ చొప్పున వర్షం పడింది. జిల్లాలో జూలై మాసంలో 13వ తేదీ వరకు 166.3 మి.మీ వర్షపాతం పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 265.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఆలయాల స్వేచ్ఛ కోసం ఎన్‌ఆర్‌ఐ సైకిల్ యాత్ర



మేదరమెట్ల: ఆలయాల స్వేచ్ఛ కోసం ప్రవాస భారతీయుడు తిరుపతి వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన వెంకటేష్ గత 12 ఏళ్లుగా జర్మనీలో ఉంటున్నారు. దేవాలయాలను భక్తులకే అప్పగించేలా చట్టాలు తీసుకురావాలని కోరుతూ సైకిల్‌పై తిరుపతికి బయలుదేరారు. బొడ్డువానిపాలెం వద్ద శనివారం ఆయన మాట్లాడారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ లేకుండా ఉండాలనేది తన ఆకాంక్ష అని, అందుకోసం 300 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేస్తున్నానని చెప్పారు. ఆలయాల స్వేచ్ఛపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

కనక దుర్గమ్మకు రికార్డు స్థాయి ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వారాంతపు రద్దీతో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రికార్డు స్థాయి ఆదాయం లభించింది. శనివారం వివిధ ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.37.03 లక్షల ఆదాయం సమకూరిందని దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు రూ.37,03,032 ఆదాయం లభించిందని పేర్కొన్నారు. రూ.500 టికెట్ల ద్వారా రూ.12.62 లక్షలు, రూ.300 టికెట్ల ద్వారా రూ.3.33 లక్షలు, రూ.100 టికెట్ల ద్వారా రూ.4.75 లక్షల ఆదాయం లభించిందని వివరించారు. ఇక కేశఖండన శాలలో టికెట్ల విక్రయం, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా భారీగా ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. అన్నదానం, ఇతర విరాళాల ద్వారా రూ.3.15 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.

ప్రవేశాల వేళ.. సీఎస్‌ఈ కళ

16న సీట్ల కేటాయింపు

- 17 నుంచి ప్రారంభం కానున్న విద్యార్థుల చేరికలు
- సీఎస్‌ఈ సీట్ల కోసం పోటీ
- ఏ గ్రేడ్ కళాశాలల వైపు మొగ్గుచూపుతున్న విద్యార్థులు
- క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాల కల్పన ఆధారంగా కళాశాలల ఎంపిక
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 కళాశాలల్లో 22వేలకు పైగా సీట్లు

ముగిసిన 'ఇంజినీరింగ్' వెబ్ ఆప్షన్ల నమోదు



ఏపీ ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీసెట్-2024 ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈనెల ఒకటో తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో మొదలైన ప్రక్రియ ధ్రువపత్రాల పరిశీలన, కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఉద్దేశించిన వెబ్ ఆప్షన్ల నమోదుతో ముగిసింది. ఆన్‌లైన్‌లో విద్యార్థులు ముందుగా నమోదు చేసుకున్న ఆప్షన్లు మార్చుకుని, కొత్తగా ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈనెల 13వ తేదీవరకు అవకాశం ఇచ్చింది. కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఉద్దేశించిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముగియడంతో విద్యార్థులకు ఏపీ ఈఏపీసెట్-2024లో సాధించిన ర్యాంకు ఆధారంగా ఈనెల 16న ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల కేటాయింపు జరగనుంది. ఈఏపీసెట్‌లో సాధించిన ర్యాంకుతో పాటు ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కులను పరిగణలోకి తీసుకుని విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నారు. సీట్ల కేటాయింపు అనంతరం విద్యార్థులు ఈనెల 17 నుంచి 22వ తేదీ మధ్య సీటు పొందిన కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఈనెల 19నుంచి బీటెక్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి.

కళాశాలల వారీగా ఆప్షన్లు...

ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న 42 ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు ఏఎన్‌యూ, నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, ప్రైవేటు రంగంలోని రెండు యూనివర్సిటీల్లో 22వేలకు పైగా ఉన్న సీట్లలో విద్యార్థులు నమోదు చేసుకున్న ఆప్షన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు జరపనున్నారు.

పరిశీలన తర్వాతే చేరిక..

జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఐఐటీ, ఎన్ఐటీలలో సీటు సాధించలేకపోయిన విద్యార్థుల్లో ఎంతో మంది ఈఏపీసెట్‌లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించినవారు ఉన్నారు. వీరు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రైవేటు యూనివర్సిటీలు, ఏ గ్రేడ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఎస్‌ఈలో చేరేందుకు సిద్ధమయ్యారు. ప్రైవేటు యూనివర్సిటీల్లో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తవ్వగా, ఏపీ ఈఏపీసెట్ సీట్ల కేటాయింపు ఈనెల 16న జరగనుంది. విద్యార్థులు ప్రధానంగా మౌలిక వసతులు, నిష్ణాతులైన అధ్యాపకులను పరిగణలోకి తీసుకుని ఏ గ్రేడ్ కళాశాలల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో పాటు ఆయా ఇంజినీరింగ్ కళాశాలలు ప్రతి యేటా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నవీ, లేనిదీ పరిశీలించుకుని, ఎంపిక చేసుకున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు బీటెక్ పూర్తయిన తరువాత ఉద్యోగ కల్పన వివరాలను నిశితంగా పరిశీలించి, ఆయా కళాశాలలను ఎంపిక చేసుకుంటున్నారు.

సీఎస్‌ఈ వైపే మొగ్గు..



విద్యార్థుల్లో ఎక్కువ మంది కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) వైపే మొగ్గుచూపుతున్నారు ఏ గ్రేడ్ కళాశాలల్లో సీఎస్‌ఈ తర్వాత అదే బ్రాంచిలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డేటా ఎనాలసిస్, క్లౌడ్ కంప్యూటింగ్ కోర్సులపై ఆసక్తి కనబరుస్తున్నారు. వీటి తరువాత ఈసీఈ, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులపై దృష్టి సారిస్తున్నారు.

నూతన ఎస్పీగా సతీష్‌కుమార్

తుషార్ డూడీ బాపట్ల ఎస్పీగా బదిలీ



గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

నగరంపాలెం: గుంటూరు జిల్లా నూతన ఎస్పీగా ఎస్.సతీష్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం జరిగిన ఐపీఎస్‌ల సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన గుంటూరు జిల్లాకు బదిలీయ్యారు. ప్రస్తుతం కాకినాడ ఎస్పీగా విధులు నిర్వహిస్తోన్న సతీష్‌కుమార్ 2016 ఐపీఎస్ బ్యాచ్, తమిళనాడు వాసి. బీటెక్ (బయోటెక్నాలజీ) విద్యనభ్యసించగా, తమిళనాడు రాష్ట్రంలో ట్రెజరీ శాఖలో సుమారు రెండున్నరేళ్లు విధులు నిర్వర్తించారు. 2016లో ఐపీఎస్‌కు ఎంపికకాగా, తొలి పోస్టింగ్ చింతపల్లి ఏఎస్పీగా, నర్సీపట్నం ఏఎస్‌డీగా, ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీయ్యారు. అక్కడ నుంచి కాకినాడ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ, ప్రస్తుతం గుంటూరు జిల్లా ఎస్పీగా బదిలీయ్యారు.

బాపట్ల జిల్లాకు తుషార్ డూడీ..

గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ ఏడాది జనవరి చివర్లో జరిగిన ఐపీఎస్ బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. వైఎస్సార్ జిల్లా అదనపు ఎస్పీ (ఏఎస్పీ)గా విధులు నిర్వహిస్తోన్న ఆయనకు ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయన బాపట్ల జిల్లా ఎస్పీగా బదిలీపై వెళ్లనున్నారు.

'పాత పెన్షన్' పునరుద్ధరించకుంటే ఉద్యమిస్తాం



యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద జీపీఎస్ ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

జీపీఎస్ ఉత్తర్వుల ప్రతులను దహనం చేసిన యూటీఎఫ్ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలను కాలరాస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన గ్యారెంటీడ్ పెన్షన్ స్కీం (జీపీఎస్) ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద శనివారం ప్రభుత్వం పాత తేదీతో విడుదల చేసిన జీపీఎస్ జీఓ 54కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు సంబంధిత జీఓ ప్రతులను దహనం చేశారు. కళాధర్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చని పక్షంలో పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 2003 డీఎస్సీ ద్వారా నియామకాలు పొందిన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు కన్వీనర్ సీహెచ్ ఆదినారాయణ మాట్లాడుతూ జీపీఎస్‌ను బలవంతంగా అమలు చేయాలని చూస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వరరావు, ఏఎల్ శివపార్వతి, కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, సభ్యులు కె.రంగారావు, వినోద్, గోపయ్య, బాజీబాబా పాల్గొన్నారు.

తక్షణ సహాయంగా రూ. 10 లక్షలు మంజూరు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పర్యటన



పీహెచ్‌సీలో రోగులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో డయేరియా సమస్యను పరిష్కరించేందుకు తక్షణ సహాయం కింద రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. పట్టణంలోని మారుతీనగర్, లెనిన్‌నగర్ ప్రాంతాల్లో డయేరియా ప్రబలటంతో ఆ ప్రాంతాలను పరిశీలించేందుకు శనివారం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు పర్యటించారు. మారుతీనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులను ఏ నీరు తాగుతున్నారని, ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీశారు. అనంతరం పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం డ్రైనేజీలో కొంత చెత్త పేరుకుపోవటంతో మంత్రి నారాయణ స్వయంగా డ్రైనేజీని కర్ర సహాయంతో క్లీన్ చేశారు. అక్కడ నుంచి తాగునీటి పవర్ బోర్లను పరిశీలించి వాటిని ఆపేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆర్ అండ్‌బీ బంగ్లాలో మంత్రి నారాయణ మాట్లాడుతూ రెండు రోజుల కిందట పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్‌నగర్, మారుతీనగర్ వంటి ప్రాంతాలను పరిశీలించి అధికారులు అప్రమత్తమై వెంటనే డ్రైనేజీ పనులు నిర్వహించాలని, నీటిని ల్యాబ్‌కు పంపించామన్నారు. 8 బోరుల్లో నైట్రేట్ కలిసిందని గుర్తించామని, వాటిని ఆపివేయటం జరిగిందన్నారు. 36 చేతి పంపులను కూడా అధికారులు పరిశీలించి వాటిని కూడా శుభ్ర పరచాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా డయేరియా ప్రబలిన ప్రాంతాలపై సమీక్షించి ఎప్పటికప్పుడు అధికారులను, మంత్రులను, ఎమ్మెల్యేలను అప్రమత్తం చేస్తున్నారన్నారు. ప్రజలు కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు రోజుల వ్యవధిలో మంత్రి నారాయణ ప్రభావిత ప్రాంతాలను సందర్శించారన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవి, ఆర్‌డీఓ రమాకాంత్‌రెడ్డి ఉన్నారు.

తల్లీకుమారుల హత్యకు విఫలయత్నం

- చాకచక్యంగా తప్పించుకున్న శైలజ, శివ
- పోలీసులు, పవర్‌ప్లాంట్ సిబ్బంది రాకతో నిందితుడు పరారీ
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



హతమార్చి పూడుద్దామనుకున్న గొయ్యిని పరిశీలిస్తున్న ఎస్ఐ ఫిరోజ్

ఈపూరు: పథకం ప్రకారం తల్లిని, ఆమె కుమారుడిని హతమార్చేందుకు ప్రయత్నించి విఫలమైన సంఘటన మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. వినుకొండ రూరల్ సీఐ సుధాకర్, ఈపూరు ఎస్ఐ ఫిరోజ్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన భూపతి శైలజ, ఆమె మొదటి భర్త కుమారుడు శివ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నివాసం ఉంటున్నారు. ఇదే క్రమంలో ముప్పాళ్ల గ్రామానికి చెందిన ముద్దా శ్రీనివాసరావు సిమెంటు పనులకు వెళ్లి అక్కడే ఉంటూ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయం ప్రేమగా మారి ఆమెతో శారీరక సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న ముద్దా శ్రీనివాసరావు ఆమె గర్భం తొలిగిద్దామని ఒప్పించి కుమారుడితో సహా ముప్పాళ్ల వైద్యశాలకు తీసుకొచ్చాడు. శుక్రవారం రాత్రి ఆమె కుమారుడిని గ్రామంలోని రెస్టారెంట్ వద్ద ఉంచి ఆమెను ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని అద్దంకి బ్రాంచి కెనాల్ సగం దూరంలోకి తీసుకొని వెళ్లి బలవంతంగా గొంతు నులిమాడు. ఆమె చనిపోయినట్లు నటించింది. శైలజ చనిపోయిందని భావించిన శ్రీనివాసరావు రెస్టారెంట్ వద్దకు వచ్చి కుమారుడిని కూడా హతమార్చేందుకు బైక్‌పై సంఘటనా ప్రాంతానికి తీసుకొచ్చాడు. శివ తప్పించుకుని పారిపోయి చెట్ల పక్కన దాక్కున్నాడు. ఈలోపే శైలజ లేచి సమీపంలోని ధనలక్ష్మి పవర్‌ప్లాంట్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందిని లేపడంతో సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పవర్ ప్లాంట్ సిబ్బంది, పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకునే సరికి వీరిని చూసిన ముద్దా శ్రీను ద్విచక్రవాహనాన్ని అక్కడ వదిలేసి పారిపోయాడు. కాల్వకట్టపైన వీరిని చంపి పూడ్చిపెట్టేందుకు ఒక గుంతను కూడా తీశాడు. అయితే పోలీసులు అక్కడకు చేరుకొని తల్లి, కుమారుడి వద్ద వివరాలు సేకరించి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముద్దా శ్రీనివాసరావు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇదంతా పథకం ముందుగానే రచించి ఈ పనిచేసి ఉంటాడని గ్రామస్తులు అంటున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీ నాటకశాలలే దిక్సూచి

- యువత రాకతో నాటకానికి పూర్వవైభవం
- ప్రముఖ రంగస్థల, సినీనటుడు, దర్శకుడు ఎస్‌ఎం బాషా



'న్యూ బాంబే టైలర్స్' నాటకంలో...(ఎడమ)

తెనాలి: నాటకం...బతుక్కో పాఠం...నాటక ప్రదర్శనకు వస్తున్నవారిలో ఎక్కువమంది యువతే. యువనటులూ ఈవైపే వస్తున్నారు. భిన్నమైన కథలు, అధునాత సాంకేతికత భాగస్వామ్యంతో నాటకానికి పూర్వవైభవం వస్తోంది. ఇదంతా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో.. అక్కడ కొంతకాలంగా టికెట్ ప్రదర్శనలకు హౌస్‌ఫుల్ బోర్డులు పెడుతున్నారు. ఆ వైభోగం మన రాష్ట్రంలోనూ రావాలంటే మినీ నాటక శాలలు అందుబాటులోకి రావాలి. నటశిక్షణకు కేంద్రప్రభుత్వ ఫండింగ్‌ను అందుకోవాలి. ఆదిశగా సమాయత్తం కావాలని ప్రముఖ రంగస్థల, సినీ నటుడు, దర్శకుడు ఎస్‌ఎం బాషా అభిప్రాయం. తెనాలిలో రాష్ట్రస్థాయి నాటికల పోటీల్లో ఉత్తమ నటుడుగా ఎంపికైన బాషా, తన నట ప్రస్థానాన్ని, నాటక పునరుజ్జీవానికి సూచనలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

కొత్త కథలతో జీవం..

హైదరాబాద్‌లో ఒకప్పుడు కళాప్రదర్శనలంటే రవీంద్రభారతి ఒక్కటే. ఇప్పుడు తక్కువ ఖర్చుతో వేదికలొచ్చాయి. రంగభూమి, ఫీనిక్స్ ఎరినీ, అవర్ సేక్రెడ్ స్పేస్, లమాకాన్, నృత్యం ఫోరం ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, సప్తగిరి వంటి ఎన్నో కళావేదికలు, నాటకబృందాల కళాదాహాన్ని తీరుస్తున్నాయి. హెచ్‌సీయూ, తెలుగు యూనివర్సిటీ, నిజాం కాలేజీలు థియేటర్ ఆర్ట్స్‌లో శిక్షణనిస్తున్నాయి. ఏటా 150 మంది విద్యార్థులు పీజీ, ఎంఫిల్ పట్టాలతో బయటకొస్తున్నారు. నాటకాలు, సినిమాలు, టీవీ సీరియల్స్, లఘుచిత్రాల్లోనూ వీరికే అవకాశాలు లభిస్తున్నాయి. మూసధోరణిలో సాగే సాంఘికాలు, పౌరాణికాల స్థానంలో తెలుగు సాహిత్యకారులు కొత్త కథలతో జీవం పోస్తున్నారు.

మూడేళ్లపాటు ఆడిట్ చేయిస్తే కేంద్రం ఫండింగ్..

ఆంధ్రాలో ఈ వైభోగం రావాలంటే చిన్నపట్టణాలతో సహా మినీ నాటకశాలలు రావాలి. కళావేదిక, 150–200 మించని సీటింగ్, లైటింగ్, మైక్ సిస్టం, స్క్రీన్‌తో సహా వసతులుంటే, తక్కువ ఖర్చుతో నాటకాలు, రిహార్సల్స్, స్క్రీన్‌పై సినిమాలు, పుస్తక ఆవిష్కరణలు, సమీక్ష సమావేశాలకు అవకాశం ఉంటుంది. అంతర విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలకు వస్తున్న వివిధ రాష్ట్రాల నాటకాలు అద్భుతంగా ఉంటున్నాయి. నాటకసంస్థలు మూడేళ్లపాటు ఆడిట్ చేయిస్తే కేంద్రప్రభుత్వం ఫండింగ్ ఇస్తుంది. ఆంధ్రాలో ఇలాంటి సంస్థలు కేవలం 3–4 ఉంటే, తెలంగాణలో 20, కర్ణాటకలో వందల్లో సంస్థలున్నాయి.

నాటకాలకు ప్రేరణ తెనాలి..

నాటకాలకు ప్రేరణ ఆంధ్రాప్యారిస్ తెనాలి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో 1963లో జన్మించాను. నాన్న మౌలాబి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి. బదిలీపై తెనాలి రావటంతో ప్రాథమిక విద్య ఇక్కడే. తోటి ఉద్యోగులతో కలిసి నాన్న నాటకం వేశారు. ఆ రిహార్సల్స్, తెనాలి కళావైభవం చూస్తూ పెరిగాను. తర్వాత నరసరావుపేటలో మళ్లీ అలాంటి వాతావరణమే. హైస్కూల్లోనే ఫిరంగిపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఏకపాత్రల పోటీల్లో ద్వితీయ బహుమతి లభించింది. కాలేజీ విద్యార్థిగా అక్కడి 'రంగస్థలి'లో భాగస్వామిగా నాటకాలాడాం. యూనివర్సిటీ పోటీల్లో నా దర్శకత్వంలో ప్రదర్శించిన 'జాతర' నాటికకు ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకుడు, విలన్ బహుమతులొచ్చాయి.

వృత్తి.. ప్రవృత్తినీ బ్యాలెన్స్ చేస్తూ..

గుంటూరులో రంగస్థల కళాకారుల ఐక్యవేదిక వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా అయిదేళ్లు పనిచేశాను. హైదరాబాద్‌లోనే నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలను వివిధ జిల్లాల్లో జరగటానికి నేను తీసుకున్న చొరవే కారణం. కళాకారుల పింఛనుకు, గ్రూప్ ఇన్స్యూరెన్స్‌కు కృషిచేశాను. నేను పనిచేసిన బ్యాంకు శాఖల్లో 200 మందిని నటీనటులుగా తీర్చిదిద్దాను. బ్యాంక్ డే రోజున వారిచే నాటకాలను ప్రదర్శించేలా చేశాను. కళాకృష్ణచే 'బతుకమ్మ పేరిణి' నృత్యరూపకాన్ని ముంబయిలో బ్యాంక్ దినోత్సవ రోజున ప్రదర్శన ఇప్పించాం. వృత్తినీ, ప్రవృత్తినీ బ్యాలెన్స్ చేసుకుంటూనే ఇవన్నీ సాధించాను.

30కి పైగా బహుమతులు..



ఎస్‌ఎం బాషా

చదువయ్యాక 1986లో బ్యాంకు జాబ్ వచ్చింది. ఎక్కడకు వెళ్లినా నాటకాన్ని ఆపలేదు. హైదరాబాద్‌లో సెటిలయ్యాను. 2023 జూన్‌లో రిటైర్ అయ్యాను. మరోవైపు ఇన్నేళ్ల కెరీర్‌లో 60 నాటిక/నాటకాలను వందల ప్రదర్శనలిచ్చాను. దర్శకత్వం వహించాను. 60 మంది టీమ్‌తో 'రంగుల రాట్నం' నాటకాన్ని విస్తృతంగా ఆడాం. కథా రచయిత గంధం నాగరాజుతో నాటకం రాయించింది నేనే. లక్ష్మి, మహాత్మ, గోల్కొండ హైస్కూల్, బాణం వంటి సినిమాల్లోనూ నటించాను. తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం, గరికపాటి రాజారావు పురస్కారం, నంది నాటకాల్లో ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయనటుడు సహా వివిధ పరిషత్తుల్లో 30 పైగా బహుమతులు అందుకున్నాను.

సారె సంబరం.. భక్తుల కోలాహలం



అమ్మవారి ఉత్సవమూర్తి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహిళలు బృందాలుగా జగన్మాత దుర్గమ్మ దర్శనానికి వేలాదిగా తరలి వచ్చారు. అమ్మను కనులారా దర్శించుకుని ఆషాఢ సారె సమర్పించి తరలించారు. కనకదుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కాలనీలు, అసోసియేషన్లు, సేవా సంఘాలు, ఉమ్మడి కుటుంబాలు, ఆధ్యాత్మిక బృందాల సభ్యులు ఇలా.. శనివారం రికార్డు స్థాయిలో వందకు పైగా బృందాలు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించాయి. వరస సెలవుల నేపథ్యంలోదుర్గమ్మ సన్నిధికి భక్తుల తాకిడి పెరిగింది. విజయవాడ నగరమే కాదు ఉమ్మడి కృష్ణా జిల్లా, రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్నాటక నుంచి భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘాట్‌రోడ్డు మూసివేత

శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో దుర్గగుడి ఘాట్‌రోడ్డులో కొండ రాళ్లు జారి పడ్డాయి. దీంతో ఉదయం తొమ్మిది గంటల నుంచి దుర్గగుడి ఘాట్‌రోడ్డును ఆలయ అధికారులు మూసివేశారు. ఘాట్‌రోడ్డు వైపు వచ్చే భక్తులను మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం వైపు వెళ్లాల్సిందిగా సూచించారు.

క్లుప్తంగా

ఏసీ మెకానిక్ కుటుంబానికి రూ 1.20 లక్షల సాయం



మంగళగిరి: ఇటీవల మృతి చెందిన ఏసీ మెకానిక్ కుటుంబాన్ని రాష్ట్ర రిఫ్రిజిరేటర్స్, ఎయిర్ కండీషనర్స్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదుకుంది. వివరాల్లోకి వెళితే నవులూరుకు చెందిన ఏసీ మెకానిక్ జాకీర్ ఇటీవల నాగార్జున యూనివర్సిటీ వద్ద విల్లాస్‌లో ఏసీ రిపేర్ చేస్తూ విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. జాకీర్ కుటుంబం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో అసోషియేషన్ స్పందించి, రూ 1.20లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. అసోషియేషన్ ప్రెసిడెంట్ జానీ శనివారం జాకీర్ కుటంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసి, అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పర్యావరణవేత్త జాజికి సన్మానం



కారెంపూడి: కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)ని పల్నాడు జిల్లా జేసీగా పనిచేసి ప్రస్తుతం విజయనగరం మన్యం కలెక్టర్‌గా పని చేస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్ శనివారం సాయంత్రం సన్మానించారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా విశిష్ట సేవలందించిన కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు నరసరావుపేటలో జరిగిన ఘన వీడ్కోలు సభలో జాజిని కలెక్టర్ శ్యాం ప్రసాద్ చేతుల మీదగా సన్మానించారు. సాధారణ వ్యక్తిగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న జాజిని కలెక్టర్ శివశంకర్ గుర్తించి ప్రోత్సహించారని ఆయన ప్రోత్సాహం వల్ల జాజి వేలాది పాఠశాలల విద్యార్థులకు ప్రకృతి పాఠాలు బోధిస్తూ వారిలో పర్యావరణ స్ఫూర్తిని నింపుతున్నారని పలువురు జాజిని అభినందించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామానికి చెందిన యువకుడి హత్యకేసులో నిందితులను శుక్రవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై అమరావతి సీఐ ఎ.వి బ్రహ్మం అందించిన సమాచారం ప్రకారం.. ధరణికోట గ్రామానికి చెందిన నర్రా భార్గవ్(30)ను హత్యచేసి పరారైన అతని బంధువులు నూతలపాటి శ్రీనివాసరావు, నంబూరు శ్రీనివాసరావులను శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. శనివారం నిందితులను సంఘటన స్థలానికి తీసుకెళ్లి విచారించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేస్తున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం శనివారం సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు.

పెనుమాకలో వణికిస్తున్న జ్వరాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో గత వారం రోజుల నుంచి ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరంతగ్గినా, కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు విడవకుండడంతో తీవ్రంగా బాధపడుతున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శనివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో జిల్లా సహాయ మలేరియా అధికారి శ్రీమన్నారాయణ తన బృందంతో పర్యటించి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమలను నివారించేందుకు వ్యక్తిగతంగా చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ చేయించామన్నారు.



పెనుమాకలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి శ్రీమన్నారాయణ

ప్రస్తుతం పెనుమాకలో సీజనల్‌గా వచ్చే జ్వరాలు మాత్రమే ఉన్నాయని, కొంతమందికి కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులని చెబుతున్నారని, అవి కూడా ఎందుకు వస్తున్నాయని వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని, జ్వరం వచ్చిన వారిలో అటువంటి సూచనలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు పరికరాలు ఉన్నాయని, మలేరియా, డెంగీ జ్వరాలను నిర్ధారించే ఆధునిక పరికరాలు ఉన్నాయని, ఎవరికైనా అనుమానం ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాత టైర్లు, కుండలు, తొట్టిలు, ఇతర పాత్రల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని ఆయన అన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన 'మ్యాథ్స్' అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 4వ గణిత విభాగం అంతర్జాతీయ సదస్సు శనివారం ఘనంగా ముగిసింది. ఈ సదస్సుకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్) డాక్టర్ జి.రవి ముఖ్య అతిథిగా విచ్చేసి ఇంజినీరింగ్‌లో గణితం యొక్క ఆవశ్యకతను, ఇతర విభాగాలతో అనుసంధానమైన సమస్యలపై ప్రసంగించారు. జలంధర్‌లోని ఎన్‌ఐటీ, మ్యాథమేటిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.శివరాజ్ మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్‌ల ద్వారా జీట్ మరియు మాస్ ట్రాన్స్‌ఫర్‌పై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కేరళ గణిత శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ సింగ్ సమాచార సిద్ధాంతంపై ప్రసంగించగా, పోస్ట్ లంచ్ సెషన్‌లో ప్రతినిధులందరూ హైబ్రిడ్ మోడ్ ద్వారా తమ పరిశోధనా ఫలితాలను సమర్పించారు. తమిళనాడు సవీత విశ్వవిద్యాలయ మ్యాథమేటిక్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృష్ణ కుమార్ ఇంజినీరింగ్ మరియు సైన్స్ విభాగాల్లో పైథాన్ ప్రోగ్రామింగ్ అప్లికేషన్‌లతో డేటా అనలిటిక్స్‌పై ఉపన్యాసం ఇచ్చారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం



ముఖ్య అతిథి జి.రవిని సత్కరిస్తున్న ఆచార్యులు డాక్టర్ బి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.వి.అప్పారావు

ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు విద్యార్థులకు నైపుణ్యాల గురించి వివరించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, ఎఫ్ఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, గణిత విభాగాధిపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బి.వి. అప్పారావు, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.రేణుక, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌పై బోల్తా కొట్టిన కారు



తెనాలిరూరల్: అతి వేగంగా వెళుతూ అదుపు తప్పిన కారు డ్రెయినేజిపైకి బోల్తా కొట్టింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఏపీ39ఏయూ1371 నంబరుగల కారు శనివారం మధ్యాహ్నం తెనాలి నుంచి బుర్రిపాలెం వైపు వేగంగా వెళుతోంది. ఈక్రమంలో బీసీ కాలనీ వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బార్బర్ షాపును ఢీకొట్టి ప్రధాన డ్రెయిన్ మీదకు బోల్తా కొట్టింది. ఘటన జరిగినప్పుడు కారులో నలుగురు యువకులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి గాయాలు కాకుండా వారంతా బయటపడ్డారు. బార్బర్ షాపు మూసివేసి ఉండడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కారులోని యువకులు మద్యం తాగి ఉంటారని అక్కడి వారు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కారు నంబరు ఆధారంగా వాహన యజమానిని గుర్తించి స్టేషనుకు రావాలని చెప్పినట్లు తెలిసింది. తమ కారును డ్రైవరు తీసుకెళ్లాడని ప్రమాదం గురించి తమకు తెలియదని సదరు యజమాని పోలీసులకు తెలిపినట్టు సమాచారం. పోలీసులు విచారణ చేపట్టారు.

అప్సా రాష్ట్ర సమన్వయకర్తగా మల్లిఖార్జునరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర సమన్వయకర్తగా గుంటూరు నగరంలోని వేంకటేశ్వర పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ బత్తిన మల్లిఖార్జునరావు ఎన్నికయ్యారు. శనివారం ఏటీ అగ్రహారంలోని విజేత హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో మల్లిఖార్జునరావును రాష్ట్ర సమన్వయకర్తగా అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యరాజు, మాజీ రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ సుందరరాము ప్రకటించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యరాజు మాట్లాడుతూ అసోసియేషన్ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో తగిన గుర్తింపు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అప్సా కోశాధికారి చెరుకూరి శ్రీహరి, గుంటూరు ఈస్ట్, వెస్ట్ డివిజన్ల



బత్తిన మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుందరరాము, అప్సా ప్రతినిధులు

సభ్యులు నర్రా రాజేష్, వంగా శ్రీనివాస్, కేసీవై రాజేష్ నాయుడు, సుజాత ఆదిత్య, రుక్సార్, వాసవి శ్రీనివాస్, దరహాస్ శ్రీనివాస్, గ్రీన్ ల్యాండ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా భారతి నూతన చైర్మన్‌గా గోపాలకృష్ణ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడా భారతి గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. దీనికి చైర్మన్‌గా స్నాప్ జిమ్ అధినేత ఎం.గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక లక్ష్మీపురంలోని ఫిట్‌జిమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా చల్లా వెంకటేశ్వర రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నంబూరు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా కొసనా వేణుగోపాల్, కోశాధికారిగా ఎం.రాజేశ్వరరావులను ఎన్నుకున్నారు. చైర్మన్ గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రీడా భారతి శాఖలు విస్తృతంగా పనిచేస్తున్నాయన్నారు. క్రీడలను ప్రోత్సహించ



క్రీడా భారతి నూతన కార్యవర్గం

డంతోపాటు ఔత్సాహిక క్రీడాకారులను గుర్తించి వారిని ముందుకు తీసుకెళతామని చెప్పారు. విజయవాడలో ఆదివారం ఆల్ ఇండియా క్రీడా భారతి సమావేశం జరుగుతుందన్నారు.

భారతీ రామసుబ్బన్‌కు వరదరాజ అయ్యంగార్ అవార్డు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాన కళానిధి వింజమూరి వరదరాజ అయ్యంగార్ 109వ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో జరగ్గా, వింజమూరి సంధ్య (చెన్నై), ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం విదుషి భారతి రామసుబ్బన్‌ను డాక్టర్ వింజమూరి వరదరాజ అయ్యంగార్ మెమోరియల్ అవార్డుతో సత్కరించారు. భారతి రామసుబ్బన్ (చెన్నై) శాస్త్రీయ సంగీత కచేరీ జరగ్గా, వయోలిన్‌పై మంతా శ్రీరమ్య (చెన్నై), మృదంగంపై పారుపల్లి సుబ్బరాయ ఫల్గున్ (విజయవాడ), ఘటంపై ఎం.హరిబాబు (గుంటూరు) చక్కటి సహకారం అందించారు. ముఖ్యఅతిథిగా జడ్పీ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, ఆత్మీయ



భారతి రామసుబ్బన్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

అతిథిగా డాక్టర్ కారుమూరి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, అధ్యక్షులు డాక్టర్ పి.విజయ, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు.

సీఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గురువారం ప్రకటించిన సీఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగుర వేశారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్తపేటలోని శ్రీమేధ కార్యాలయంలో శనివారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో నందకిషోర్ మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో 450కు పైగా ఆలిండియా ర్యాంకులు సాధించామని తెలిపారు. సీఏ ఇంటర్ రెండు గ్రూపుల విభాగంలో ఎ.సాయి వెంకట ధీరజ్ 435 మార్కులతో పాటు ఎన్.స్తుతి హర్షిత 360, కె.బాలచంద్ 332, జె.ప్రియ కుమారి 326, డి.లక్ష్మీనరసింహ 322, కె.దుర్గ 315 వంటి టాప్ మార్కులు సాధించారని వివరించారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే క్రమశిక్షణతో కూడిన కోచింగ్ అందించడం ద్వారా తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులు, మార్కులు సాధిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ఈనెల 15 నుంచి తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.



విద్యార్థులతో శ్రీమేధ చైర్మన్ నందకిషోర్, శ్రీలక్ష్మి

పెట్టుబడి సాయం రూ.20వేలు సత్వరం ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: గత ఏడాది మిచాంగ్ తుఫాన్, అధిక వర్షాల కారణంగా రైంతాంగం పంటలు దెబ్బతిని ఉందని, వారికి రూ.20 వేల పెట్టుబడి సాయం సత్వరం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం గుంటూరు జిల్లా తెనాలిలో విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది పంటలు చేతికొచ్చే తరుణంలో మిచాంగ్ తుఫాన్ రావటంతో రైతులు పలువురు నష్ట పోయినట్టు గుర్తుచేశారు. నష్టపోయిన రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలను పటిష్టపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ సిఫార్సులను అమలుచేయాలని, కేరళ ప్రభుత్వం సీ2 ప్లస్ 50 విధానాన్ని 14 రకాల పంటలకు అమలు చేస్తోందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం వరికి రూ.712, జొన్నలుకు రూ.1066, మొక్కజొన్నకు రూ.570, మినుములకు రూ.2344, పెసలుకు 2,206 నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసేలా అసెంబ్లీలో చట్టం చేయాలని, తప్పులు లేని పట్టాదారు పుస్తకాలను, కౌలురైతులకు సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు.

అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు

రేపల్లె రూరల్: అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా రేపల్లె నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షంతో పట్టణంలోని పలు రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. ప్రధానంగా మున్సిపల్ రోడ్డు, ప్రకాశం రోడ్డు, నిజాంపట్నం రోడ్డులలో వర్షపు నీరు నిలబడటంతో వాహన చోదకులు, పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు. వర్షంతో పాటు బలమైన ఈదురు గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు, ఫ్లెక్సీలు నేలకొరిగాయి. పట్టణంలోని బస్టాండ్ సెంటరులో రోడ్డుపై పడిన చెట్లు, ఫ్లెక్సీలను మున్సిపల్ కార్మికులు తొలగించారు. రేపల్లె పట్టణంలో 38.6 మి.మీ., నగరంలో 36.4 మి.మీ., నిజాంపట్నంలో 30.4 మి.మీ., చెరుకుపల్లిలో 63.4 మి.మీ.వర్షపాతం నమోదయ్యింది.

గాలులకు చెట్టు కూలి ఇల్లు ధ్వంసం

ఐలవరం(భట్టిప్రోలు): మండలంలోని ఐలవరం తూర్పు మాదిగపల్లికి చెందిన మునిపల్లి నాగేంద్రం రేకుల షెడ్డు ఇంటిపై శుక్రవారం రాత్రి వీచిన గాలులకు చెట్టు కూలడంతో ధ్వంసం అయ్యింది. ఈ ఇంట్లో భార్యాభర్తలు ఉంటున్నారు. నాగేంద్రం అనారోగ్యంతో బాధపడుతుండగా, భార్య కూలీనాలి చేసుకుని కుటుంబం నెట్టుకు వస్తోంది. సమాచారం మేరకు వీఆర్వో రత్నాకర్ కూలిన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి రెవెన్యూ శాఖ తరపున తక్షణ సహాయం కింద 20 కిలోల బియ్యం అందించారు. గృహ నిర్మాణానికి ఆ శాఖకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు.



ఐలవరంలో ధ్వంసమైన రేకుల షెడ్డు ఇల్లు

నీట మునిగిన వరి పంట..

వేమూరు(చుండూరు): నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం వల్ల పొలాలు నీట మునిగాయి. రైతులంతా ఖర్చులు తగ్గించేందుకు వెద సాగు చేపట్టారు. ప్రభుత్వం సకాలంలో కాలువలకు నీరు విడుదల చేయక పోవడంతో కొందరు వర్షపు నీటిపై, మరి కొందరు విద్యుత్ మోటార్లపై ఆధారపడి వెద సాగు చేశారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షం వల్ల పొలాలన్నీ నీట మునిగాయి. నీటిని బయటకు పంపించేందుకు రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. నీటిని త్వరగా బయటకు పంపకపోతే పంట దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.